

వర్షం సాక్షిగా.. పూల పండగ





తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. జిల్లాలోని వాడవాడలా మహిళలు, యువతులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి ఆడిపాడారు. తొమ్మిది రోజుల పాటు సాగే వేడుకలో తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవం నిర్వహించారు. హనుమకొండలోని రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో వేడుక అత్యంత వైభవంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు బతుకమ్మలతో భారీ సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. సాయంత్రం మహిళలు వర్షంలోనే ఆడిపాడారు. రాధేశ్యాం సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించారు. ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమ విజేతలకు బహుమతులు అందజేశారు.

– న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

మరిన్ని చిత్రాలు 9లో..



బతుకమ్మను పేరుస్తున్న ఎంపీ కడియం కావ్య



కొత్తవాడ కోట మైదానంలో మంత్రి కొండా సురేఖ తదితరులు..



మహాత్ముడికి వందనం

జయంతి సందర్భంగా హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కడియం కావ్య, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారదా దేవి, ప్రావిణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, భాజపా నేతలు రావు పద్మారెడ్డి, మార్తినేని ధర్మారావు, అరూరి రమేశ్ (కుడి నుంచి ఎడమకు) – ఈనాడు, హనుమకొండ

మిగతా 9లో..

పక్కాగా సమాచార సేకరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ పరిధిలో 'ఫ్యామిలీ డిజిటల్ సర్వే' సమాచారం పక్కాగా ఉండాలని కమిషనర్ డా.అశ్విని తానాజీ సూచించారు. బుధవారం బల్దియా సమావేశ మందిరంలో క్షేత్రస్థాయి సర్వే బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 7 వరకు సర్వే చేయాలని, తొలివిడతలో వరంగల్ ప్రాంతంలో 12, 38 డివిజన్లు, హనుమకొండలో 10, 48వ డివిజన్లలో సర్వే చేపట్టనున్నట్లు వివరించారు. రెండు జిల్లాల ఆర్డీఓలు నోడల్ అధికారులుగా ఉంటారన్నారు. ప్రతి బృందం రోజుకు 50 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. సర్వే ఎలా చేయాలన్న దానిపై కాజీపేట సర్కిల్ ఉప కమిషనర్ రవీందర్ దృశ్యరూప ప్రదర్శన ద్వారా వివరించారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, పన్నులశాఖ అధికారి బిర్రు శ్రీనివాస్, ఐటీ మేనేజరు రమేశ్, ఆర్వోలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎంఈవో మనోజ్‌కుమార్

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమైంది. డీఈవో డి. వాసంతి పది ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తప్పులు దొర్లకుండా పరిశీలన కార్యక్రమం చేపట్టారు. మొదటి రోజు 82 ఎస్జీటీ పోస్టులకు 1:3 నిష్పత్తిలో 246 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 72 మంది తెలుగు, 10 ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల సర్టిఫికెట్లు మాత్రమే పరిశీలించారు. విద్యుత్తు అంతరాయం వల్ల రాత్రి వరకు ప్రక్రియ కొనసాగింది. ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో విద్యాశాఖ అధికారుల తీరుపై అభ్యర్థులు అసహనం వ్యక్తం చేశారు.

మంటలు రేపిన మాటలు





● హస్తం.. గులాబీల మధ్య వేడెక్కిన రాజకీయం

ఓరుగల్లు రాజకీయాలు ఆరోపణలు, ప్రత్యారోపణలతో అట్టుడుకుతున్నాయి. అధికార హస్తం, విపక్ష భారాస మధ్య పంచాయితీ పతాకస్థాయికి చేరుకొంది.. పచ్చ గడ్డి వేస్తే భగ్గుమన్నట్టుగా మాటల యుద్ధం మొదలైంది. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం రాజధాని హైదరాబాద్‌లో మాజీ మంత్రి, భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయి ఆరోపణలు చేయడం, అంతకు రెండు రోజుల ముందు ఓరుగల్లు అభివృద్ధి పనులపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ల మధ్య జరిగిన గలాటా లాంటి వరుస ఘటనలు ఓరుగల్లులో కలకలం రేపాయి.

– ఈనాడు, వరంగల్

భాజపా నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఇటీవల నూలు దండను బహుమానంగా మంత్రి కొండా సురేఖ మెడలో వేయడం, ఆ తర్వాత నెటిజన్లు దీనిపై ట్రోలింగ్ చేయడం గొడవకు దారి తీసింది. భారాస నేతలే పనిగట్టుకొని ట్రోలింగ్ చేస్తున్నారని, ఈ వ్యవహారం వెనక మాజీ మంత్రి కేటీఆర్ ఉన్నారంటూ సురేఖ విరుచుకుపడ్డారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ భవన్‌ను ముట్టడించిన కార్యకర్తల్లో వరంగల్‌కు చెందిన వారు ఉన్నారు. మహిళా మంత్రి అని కూడా చూడకుండా గులాబీ నేతలు అభ్యంతరకరంగా పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మంత్రి సురేఖకు సంఘీభావం తెలిపారు. ఈ రాజకీయ వివాదంపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ కీలక నేతలు మడికొండ ఠాణాలో బుధవారం ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశమై ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వాలని సూచించిన నేపథ్యంలో కొండా సురేఖ వర్సెస్ కేటీఆర్ వివాదాన్ని కాంగ్రెస్ శ్రేణులు అంత తేలిగ్గా వదలడం లేదు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నా.. తామంతా ఒక్కటేనని చాటుతూ భారాసపై పదునైన విమర్శలు గుప్పిస్తూ ప్రజల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

నువ్వా.. నేనా..



మరో వైపు పశ్చిమ నియోజకవర్గంలోనూ అధికార విపక్ష పార్టీల మధ్య అభివృద్ధిపై అగ్గిరాజుకుంది. ఇరు పార్టీల కార్యకర్తల తోపులాటలకు దారి తీసింది. ఇటీవల కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ నాలాపై వంతెన పనులు పూర్తయ్యాయి. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయడం వల్లే వీటిని వేగవంతంగా పూర్తి చేయగలిగామని ప్రకటించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. ఈ పనులకు ప్రతిపాదనలు, నిధులు భారాస హయాంలోనే కేటాయించామని.. కాంగ్రెస్ సర్కారు అంతా తామే చేసినట్టు ప్రగల్భాలు పలుకుతోందంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో నయీంనగర్ నాలా వద్ద చేయి, కారు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగడం సంచలనంగా మారింది.

భారాస నేతలు సిద్ధం..

ఒకవైపు కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖకు శ్రేణులు మద్దతిస్తుండగా మరోవైపు కేటీఆర్‌కు మద్దతుగా భారాస ఉమ్మడి జిల్లా నేతలు నిలబడుతున్నారు. కేటీఆర్‌పై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సర్కారు వైఖరిని ఎండగట్టారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శలు చేశారు. శ్రీహరి విజయానికి ప్రతి ఒక్క భారాస కార్యకర్త కష్టపడితే ఆయన హస్తం గూటికి చేరడం ప్రజలను మోసం చేయడమే అంటూ మండిపడ్డారు.

ఎండిన చెట్టు.. పొంచి ఉన్న ముప్పు



హనుమకొండ బాలసముద్రం నుంచి చిల్డ్రన్స్ పార్కు వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు ప్రమాదకరంగా మారింది. గాలులకు కొమ్మలు విరిగిపడుతున్నాయి. చెట్టు కూలి పడే అవకాశం ఉండటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

'రాష్ట్రంలో రాక్షస పాలన'



ధర్మసాగర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న రాజయ్య, భారాస నాయకులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మూసీ నది సుందరీకరణ పేరుతో హైడ్రాతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ టి. రాజయ్య ఆరోపించారు. ధర్మసాగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ఇప్పటీ రైతు రుణమాఫీ 42 శాతమే అయిందని, రాహుల్ గాంధీ చేతుల మీదుగా విడుదల చేసి రైతు డిక్లరేషన్ హామీలకు, బడ్జెట్‌లో కేటాయింపులకు ఏమాత్రం పొంతనలేదన్నారు. ఇటీవల కేటీఆర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, కడియం శ్రీహరికి గుణపాఠం చెప్పడానికి భారాసతో పాటు కాంగ్రెస్ నాయకులు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ధర్మసాగర్ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యురాలు జుబేదా బేగం, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సోమిరెడ్డి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ బేరె వీరయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు శోభ, భారాస నాయకులు బొడ్డు ప్రభుదాసు, లాల్‌మహ్మద్, మహేందర్‌రెడ్డి, మధుకర్, ప్రభాకర్‌రెడ్డి, బాలు, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రధానోపాధ్యాయుడి తీరే వేరు..!

కమలాపూర్ (హనుమకొండ), న్యూస్‌టుడే: ఆయన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఓ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు.. పని చేసిన ప్రతిచోటా వివాదాలే.. మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగినుల పట్ల ఆయన తీరే వేరు.. వేధింపులు భరించలేక పలువురు.. డీఈవోలు, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీకి సైతం ఫిర్యాదు చేశారు. చివరికి రాష్ట్ర మానవహక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను సైతం న్యాయం కోసం ఆశ్రయించారు. ఇప్పటికీ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో, విద్యాశాఖ ఆర్జేడీ వద్ద విచారణలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో పనిచేసిన ఓ పాఠశాలలో గిరిజన మహిళా పీఈటీని వేధిస్తే ఆమె న్యాయం కోసం కమిషన్లను ఆశ్రయించారు. అయినా ఎలాంటి చర్యలు లేవు. హనుమకొండ జిల్లాలోని పాఠశాలలో ఓ ఉపాధ్యాయినిని సైతం వేధించాడు. భూపాలపల్లి జిల్లాలోని ఓ మండల కేంద్రంలో పనిచేసినప్పుడు మహిళా టీచర్ పట్ల దురుసుగా ప్రవర్తించి మానసికంగా ఇబ్బందులకు గురిచేశాడు. ప్రస్తుతం పనిచేస్తున్న కాంప్లెక్స్ పరిధిలోనూ ఆయన తీరు మారడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి మాట్లాడాలని బహు అర్థాలు వచ్చేలా మహిళలతో మాట్లాడటం ఆయనకే చెల్లింది. మహిళా ఉద్యోగులు చేసే పనిని వేరే ఉపాధ్యాయులతో చేయించడం వంటివి చూస్తే ఆయన్ను ఎవరో కాపాడుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఓ ఉపాధ్యాయుడిని వేధించిన కేసులో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఎలాంటి ఫలితం లేదు. ఓడీల పేరుతో తిరిగే ఆ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి.

ఉన్నవి మూలకు.. కొత్త వాహనాలా!



ఇది ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్షన్(ఎఫ్‌టీసీ) మిషన్. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించేందుకు రూ.2.5కోట్లతో బల్దియా కొనుగోలు చేసింది. భద్రకాళి, వడ్డేపల్లి, ఉర్సు చెరువు, కడిపికొండ, కాజీపేట బంధం చెరువుల్లో గుర్రపు డెక్క, వ్యర్థాలు తొలగించేందుకు వినియోగించారు. ఏడాది పాటు కంపెనీ ప్రతినిధులు నడిపారు. రెండేళ్లుగా దాన్ని పక్కన పడేశారు. భద్రకాళి చెరువు వద్ద వృథాగా ఉంటోంది.

న్యూస్‌టుడే, కార్పొరేషన్

పట్టణ ప్రగతి పథకం ద్వారా కొనుగోలు చేసిన వాహనాలు సరిగ్గా వినియోగించడం లేదు. బల్దియా ఇంజినీర్ల నిర్లక్ష్యంతో చాలా మూలకు చేరాయి. వాటికి మరమ్మతులు చేయకుండా వదిలేశారు. పదుల సంఖ్యలో తుప్పు పట్టిపోతున్నాయి. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం ద్వారా కొత్తవి కొనుగోలు చేయడానికి రూ.22.70 కోట్లు కేటాయించారు. డివిజన్లలో అభివృద్ధి పనులకు ఎక్కువ నిధులు కేటాయించకుండా ఇతరత్రా ఖర్చు చేయడాన్ని కార్పొరేటర్లు తప్పుపడుతున్నారు.



ఏడాది నుంచి వృథాగా ఉంటున్న కొత్త డంపర్ ప్లేసర్ వాహనాలు

ఇతరత్రా పనులకు కేటాయించిన నిధులు

● రూ.2 కోట్లతో కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో పెద్ద ఇంకుడు గుంతలు ● బాలసముద్రం పిల్లల పార్కుకు రూ.1.50 కోట్లు ● 15వ డివిజన్‌లో డ్రైనేజీ పనులకు రూ.80 లక్షలు ● 29వ డివిజన్ వరంగల్ బట్టల బజారు ఆర్వోబీ కూడలి డ్రైనేజీ పనులకు రూ.కోటి ● ఉనికిచర్ల గ్రామంలో స్ట్రార్మ్ వాటర్ డ్రైనేజీ కోసం రూ.50 లక్షలు

కొనుగోలు చేయనున్నవి	వెచ్చిస్తున్న నిధులు (రూ.కోట్లలో)
మూడు కంపాక్టర్లు	1.5
100 స్వచ్ఛ ఆటోలు	8.5
5 లోడర్లు	2.10
హిటాచీ యంత్రం	0.70
30 ట్రాక్టర్లు	4
కార్మికులకు పరికరాలు	1
హైడ్రాలిక్ వెహికిల్	0.40
బొలెరోస్ క్యాంపర్లు	0.60
250 ట్విన్ బిన్లు	0.40
10 బయో కంపోస్టు యూనిట్లు	1.5
లక్ష ప్లాస్టిక్ డబ్బాలు	2

వృథాగా ఉన్నవి..

● 2020-21లో పట్టణ ప్రగతి ద్వారా రూ.42 కోట్లలో 550 పైగా వాహనాలు కొనుగోలు చేశారు. చిన్నవి, పెద్దవి 10 స్వీపింగ్ మిషన్లు తీసుకున్నారు. ఏడాది పాటు తిరగాయి. కొన్ని నెలలుగా నాలుగు పెద్ద మిషన్లు వృథాగా ఉంటున్నాయి. ఒక్కోదాని ఖరీదు సుమారు రూ.1.50 కోట్లపైనే ఉంటుంది.

● రోడ్లు, ఖాళీ స్థలాలు శుభ్రం చేసేందుకు రూ.50 లక్షలతో బాబికాటు మిషన్లు కొన్నారు. కొన్ని నెలలు వినియోగించారు. రెండేళ్లుగా పక్కన పడేశారు.

● వరంగల్ పోతన మందిరంలో మూడు డంపర్ ప్లేసర్ వెహికిల్స్ వృథాగా ఉంటున్నాయి.

డివిజన్ల అభివృద్ధికి నిధులేవి?

డివిజన్ల అభివృద్ధి కోసం నిధులివ్వాలని కార్పొరేటర్లు గగ్గోలు పెడుతున్నారు. రెండేళ్లుగా బల్దియాలో సాధారణ నిధుల కొరత అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే గ్రాంట్ల నిధులను సక్రమంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించడం లేదు. 15వ ఆర్థిక సంఘం ద్వారా నగరానికి సుమారు రూ.50 కోట్ల వరకు రానున్నాయి. ఈ నిధులు వెంటనే వాడుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ హెచ్చరించడంతో హడావుడిగా పనులు ప్రతిపాదించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు, పార్కులు, ఇంకుడు గుంతలు, ఇతర పనులు ప్రతిపాదించారు. రెండు, మూడు తప్ప ఎక్కువ నిధులను వాహనాల కొనుగోలుకే ప్రతిపాదించారు. వెనకా ముందు చూడకుండా ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. డివిజన్ల అభివద్ధి కోసం నిధులు కేటాయించకుండా, మూలన పడిన వాహనాలకు మరమ్మతులు చేయకుండా కొత్తవి కొనుగోలు చేయడం వెనుక మతలబేమిటని కొందరు ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు.

జగన్మాతకు హరిద్రాభిషేకం



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల అంకురార్పణ పూజలు

రంగంపేట, న్యూస్‌టుడే: జగన్మాత శ్రీభద్రకాళి అమ్మవారికి బుధవారం ఉదయం హరిద్రాభిషేకం, పూర్ణాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో 40 కిలోల స్వచ్ఛమైన హరిద్రా చూర్ణం(పసుపు)తో అమ్మవారికి అభిషేకం చేశారు. హరిద్రామయమైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. భద్రకాళి శరణం మమః అంటూ ప్రణమిల్లారు. రాత్రి 7 గంటలకు శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రుల అంకురార్పణ పూజలు జరిగాయి. గురువారం ఉదయం అమ్మవారికి పూర్ణాభిషేకం, నవరాత్రి కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, ధ్వజారోహణం కార్యక్రమాలు ఉంటాయని ప్రధానార్చకుడు శేషు తెలిపారు.

బహు పౌష్టికం.. బతుకమ్మ ప్రసాదం





బతుకమ్మ ప్రసాదం ఆరోగ్యదాయం. వాటిని చిరుధాన్యాలతో తయారుచేయడం వల్ల పోషకాలు మెండుగా ఉంటాయని హనుమకొండకు చెందిన ప్రముఖ న్యూట్రిషనిస్టు జ్ఞానేశ్వర్ తెలిపారు.

పువ్వులతో దేవుడిని పూజిస్తారు.. ఆ పువ్వులనే దేవతలుగా, ఆడబిడ్డలే ఇంటి ఆరాధ్యదేవతగా పూజించే గొప్ప ప్రకృతి పండగ బతుకమ్మ. అనుబంధాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే ఈ పండగలో ప్రసాదాలు సైతం ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పూలతో తయారు చేసిన రంగు రంగుల బతుకమ్మలను చెరువు గట్టుమీదకు తీసుకెళ్లి ఆడిపాడిన తర్వాత ఆడబిడ్డలు తెచ్చుకున్న ప్రసాదాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ఆత్మీయతను పంచుకుంటారు. తొమ్మిది రోజులు రోజుకో తీరు ప్రసాదాలు(సద్దిని) తీసుకెళతారు. తరచి చూస్తే ప్రతి సద్దిలోనూ చిరుధాన్యాలతో తయారు చేసినవి ఉంటాయి. బతుకమ్మకు రోజుకో రకంగా సమర్పించే ప్రసాదాలు.. వాటి ఆరోగ్య ప్రాముఖ్యం గురించి ప్రత్యేక కథనం.

\- న్యూస్‌టుడే, కాజీపేట

1 ఎంగిలిపూల బతుకమ్మ

● ప్రసాదం: ఊక(ముడి)బియ్యం, బెల్లం కలిపిన ముద్దలు చేస్తారు.

● ప్రయోజనం: ముడి బియ్యంలో బి కాంప్లెక్సు ఉంటుంది. కొందరు నూకలతో చేస్తారు కాబట్టి త్వరగా జీర్ణం అయ్యే కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి.

2 అటుకులు..

● సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో పెసర లేదా కందిపప్పును నానబెట్టి దానినే ప్రసాదంగా తీసుకెళతారు. అటుకులనే ప్రధానంగా సద్దిగా తీసుకెళతారు కాబట్టి దీనిని అటుకుల బతుకమ్మ అంటారు.

● పెసరపప్పులో ఎక్కువగా ప్రోటీన్‌లుంటాయి. బెల్లంలో ఇనుము ఉంటుంది. ఇది బాలికలు, మహిళలకు మేలు చేస్తుంది.

3 ముద్దపప్పు

● ముద్దపప్పు, బెల్లం, పాలతో ప్రసాదం చేసుకుని తీసుకెళతారు.

● ఇందులో బెల్లం ఉంటుంది. మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరానికి కావాల్సిన ఇనుమును అందిస్తుందని ప్రముఖ న్యూట్రిషనిస్టు రమాదేవి తెలిపారు.

4 నానబియ్యం

● నానబెట్టిన బియ్యానికి పాలు, బెల్లం కలిపి వండుతారు. ఈ ప్రసాదం వేడిగా ఉండటానికి బతుకమ్మ ఆడటానికి కొద్ది సమయం ముందు తయారు చేసుకుని వెళతారు.

● ఇందులోనూ బెల్లానికి ప్రాధాన్యం ఇస్తారు.

5 అట్లు..

● బియ్యం పిండిని అట్లుగా పోస్తారు. వీటికి కొందరు బెల్లం లేదా చక్కెర కలపడం వల్ల తీయగా ఉంటాయి.

● మంచి పోషకాహారం. ఎదుగుదలకు తోడ్పడుతుంది.

6వ రోజు బతుకమ్మ పండగను సెలవు. ఈ రోజు అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. అటుకు దూరంగా ఉంటారు.

7 వేపకాయల

● సకినాలు చేసే పిండి పదార్థాన్ని చిన్న చిన్న వేపకాయలంత పరిమాణంలో ముద్దలుగా చేసి నూనెలో కాలుస్తారు. ఇవి వేపకాయల్లాగా ఉంటాయి కాబట్టి వేపకాయల బతుకమ్మ అంటారు.

● ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇంట్లో తయారుచేసుకోవచ్చు. శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.

8 వెన్న ముద్దల

● వెన్నతో తయారు చేసిన నువ్వుల ఉండలను ఫలహారంగా చేస్తారు. వెన్న, నెయ్యి, నువ్వులు శరీరానికి కావాల్సిన ప్రోటీన్, కాల్షియం అందిస్తాయి.

● వెన్న, నెయ్యి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

9 సద్దుల బతుకమ్మకు నత్తుపిండి

మొక్కజొన్న గింజలు వేయించి.. వాటిని పొడి చేసి బెల్లం రవ్వలు కలిపిన పిండినే సత్తుపిండి అంటారు. సద్దుల బతుకమ్మ రోజు ఇది చాలా ప్రత్యేకం. సజ్జలలాంటి చిరుధాన్యాలతో సద్ద ముద్దలు చేస్తారు అందుకే దీనిని సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు సద్దిని(ప్రసాదాలు) ఎక్కువగా తీసుకెళతారు కాబట్టి దీనిని సద్దుల బతుకమ్మ అని కూడా పిలుస్తారు.

● పెరుగన్నం, , చింతపండ పులిహోర, నిమ్మకాయ కొబ్బరి తురుము సద్దులను చేస్తారు. సత్తు పిండి, కొబ్బరి పొడి, నువ్వుల పొడి, మలీద ముద్దలు, పులిహోర, కొబ్బరి తురుము, పండ్ల సమర్పిస్తారు. ఇవన్నీ ఆరోగ్యదాయం..

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం కోమటిపల్లి క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 49. 3 ఓవర్లలో 192 పరుగులు చేసింది. విష్ణుశ్ 55, ఆర్థిది 35 పరుగులతో రాణించారు. చేదనలో నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. 118 పరుగుల భారీ తేడాతో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్ల కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గురువారం కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్: మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

జీఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ప్రకటన

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని నర్సింగ్ స్కూల్‌లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్ఎం)లో మూడేళ్ల కోర్సులో చేరేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ప్రకటన జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 29న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకు http://dme.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక.. మంత్రి చేయూత



ఈనాడు కథనానికి స్పందన

పలిమెల, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు తమకు రూ.లక్ష అర్థిస్తుందని, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో నగదు సమకూర్చడం చాలా భారంగా మారిందని. ఈ నేపథ్యంలో 'అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక.. ఆర్థికంగా మారిన పేదరికం' అనే శీర్షికతో మంగళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి బుధవారం కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దండెర రాజేందర్ స్పందించారు. మహాదేవపూర్ మండల పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు యువతి సమస్యను వివరించారు. నగదు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మను ఆదేశించారు. మంత్రి యువతిని సన్మానించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.

భద్రకాళి.. నమోః నమామి!



రంగంపేట, న్యూస్‌టుడే: వేదవ్యాసుడు రచించిన శ్రీదేవీ భాగవతం ప్రకారం నవరాత్రులు దేవీ ఆరాధనకు ప్రత్యేకమైనవి. విజయదశమి సందర్భంగా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. జగన్మాత నవరాత్రుల్లో తొమ్మిది రూపాలుగా దర్శనమిస్తుంది. అమ్మవారికి ఏరోజు ఏం ప్రసాదం, ఏ చీర సమర్పించినందేవీ భాగవతంలో పొందుపర్చారు. భద్రకాళి ఆలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అవతారాలు.. అలంకరణ

మొదటిరోజు: బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు. ఈ రోజు అమ్మవారికి లేత గులాబీ రంగు వస్త్రాన్ని సమర్పిస్తారు. క్షీరాన్నం నైవేద్యం.

2వ: అమ్మవారు వేదమాత శ్రీగాయత్రి దేవిగా దర్శనమిస్తారు. నారింజ రంగు వస్త్రం, కొబ్బరి అన్నం నివేదిస్తారు.

3వ: అమ్మవారు ప్రాణకోటి ఆకలి తీర్చే అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. పసుపురంగు వస్త్రం, అల్లం గారెలు సమర్పిస్తారు.

4వ: శ్రీలలితా మహాత్రిపుర సుందరీదేవిగా దర్శనం. ముదురు బంగారు రంగు వస్త్రం, కదంబం ప్రసాదాన్ని నివేదిస్తారు.

5వ: శ్రీచండీ దేవిగా కొలుస్తారు. భవానిమాతగా దర్శనం, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా చింతపండు పులిహోర, రవ్వకేసరి.

6వ: శ్రీమహాలక్ష్మిగా దర్శనం. ముదురు గులాబీ రంగు వస్త్రం, పూర్ణం బూరెలు ప్రసాదం.

7వ: శ్రీసరస్వతీ దేవిగా దర్శనం. తెల్లని వస్త్రం, నైవేద్యంగా దద్ధోజనం.

8వ: దుర్గాష్టమి, మహా దుర్గాలంకరణ, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా నిమ్మకాయ పులిహోర.

9వ రోజు: మహానవమి, మహిషాసుర మర్దిని అలంకరణ, ఆకుపచ్చని వస్త్రం, చక్కెర పొంగలి ప్రసాదం.

విజయదశమి: విజయదశమి పర్వదినం రోజు అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం, ఎరుపు, ఆకుపచ్చ రంగు వస్త్రాలు సమర్పిస్తారు. లడ్డూలు, పులిహోర, రవ్వకేసరి నైవేద్యం.

అయ్యో పాపం.. ఎంత కష్టం..

● పెళ్లైన ఐదు నెలలకే యువతికి రెండు కిడ్నీల్లో సమస్య

● డయాలసిస్‌తో సాగుతున్న జీవనం



ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న అనూష

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: కూతురుకు స్తోమతకు తగినట్లు పెళ్లి జరిపించారు. బాధ్యత తీరిందనుకున్నారు ఆ అమ్మానాన్న.. ఎన్నో ఆశలతో కొత్త కాపురానికి వెళ్లింది.. మెట్టి నింట్లో భర్తతో ఆనందంగా సాగిపోతోంది జీవితం.. ఇంతలోనే పిడుగు లాంటి వార్త.. నవ వధువుకు రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు చెప్పడంతో రెండు కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోయాయి. ఆ యువతి జీవన్మరణ పోరాటం చేస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కోడూరి అనూషకు ఏడాది కిందట బంధువుల అబ్బాయితో వివాహమైంది. ఆయన హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెళ్లయిన ఐదు నెలలకు ఒక్కసారిగా అనూష తీవ్రమైన జ్వరం వచ్చింది. వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పనిచేయడం లేదని నిర్ధారించారు. కొద్దిరోజుల్లోనే మరింత అనారోగ్యానికి గురయ్యింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోజు విడిచి రోజు డయాలసిస్ చేయిస్తున్నారు. మందులకు, డయాలసిస్‌కు రెండు రోజులకు రూ.5 వేల చొప్పున అవుతున్నాయని, దాదాపు ఇప్పటి వరకు రూ. 11 లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు కిడ్నీ మార్పిడి, ఇతర చికిత్సలకు దాదాపు మరో రూ. 10 లక్షలకు పైగానే ఖర్చవుతాయని తెలిపారు.. రోజూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుని బతికే తమకు అంత ఖర్చు భరించే స్తోమత లేదని, ఇప్పటికే అప్పులు చేసి వైద్యం అందిస్తున్నామని తండ్రి పైడయ్య పేర్కొన్నారు. దాతలు ఆదుకుంటేనే బిడ్డ దక్కుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

● దాతలు సహాయం చేయదల్చుకుంటే చరవాణి నంబర్లు 85209 63145, 99129 42026 కి సంప్రదించాలి.

చికెన్ ధరలు (కిలో వెల రూపాయలలో)		
వెన్‌కాబ్	ఫారంరేటు: 110	డ్రెస్: 191
	రిటైల్: 132	స్కిన్‌లెస్: 218

పేదల బతుకులపై పిడుగు

● ముగ్గురి మృతితో విషాదం

● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

వర్షాకాలం పిడుగుపాటు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్‌లో ముగ్గురు మృత్యువాత పడడం విషాదాన్ని మిగిల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన మహిళ రైతు కె.లక్ష్మి (45) మిరప తోటకు పిండి చల్లుతున్న క్రమంలో పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలు నిర్మల (51), రమ (45) అదే గ్రామానికి చెందిన రైతు పొలంలో పత్తి ఏరి ఇంటికి వచ్చే క్రమంలో పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. కూలీ పనికి వెళ్లి తప్పు గూట గడవని ఆ పేద కుటుంబాలకు తీరని దుఃఖంలో మునిగిపోయాయి. పట్టణాలు, పల్లెలు ఎక్కడైనా పిడుగులు పడే అవకాశముంటుందని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

అపార్ట్‌మెంట్లూ అతీతం కాదు

చాలా మంది అపార్ట్‌మెంట్లపై పిడుగు పడదన్న భ్రమలో ఉంటారు. అయితే అలాంటిదేమీ లేదని, రానున్న రోజుల్లో పిడుగుల ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ముందస్తు చర్యలతో పిడుగుపాటు ప్రమాదాన్ని నివారించవచ్చని చెబుతున్నారు. వరంగల్ నగరంలో 1000కి పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వాటి సంఖ్య వేగంగా పెరుగుతోంది. పిడుగుల నుంచి రక్షణకు సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదు.



● ఆరు నెలల కిందట హనుమకొండ నగరంలోని గాంధీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడటంతో పాక్షికంగా దెబ్బతింది.



గాంధీనగర్‌లోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన లైట్నింగ్ కండక్టర్

నిబంధనలను పాటించాలి

ఎత్తైన భవనాలు, చెట్లు పిడుగులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. అందువల్ల భవన నిర్మాణ పనులలో నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ప్రతి ఎత్తైన భవనంపై తప్పని సరిగా లైట్నింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో పొడవాటి రాగి, ఇత్తడి తీగను భవనం పైభాగాన అమర్చాలి. దానికి ఎర్త్ కనెక్షన్ ఇచ్చుకోవాలి. దీనికి విద్యుత్తును ఆకర్షించే శక్తి ఉంటుంది. ఇది పిడుగు ప్రభావం భవనంపై పడకుండా అడ్డుకుంటుంది. దాని నుంచి ఇది చిన్న ఏర్పాటే కావొచ్చు. వేల వాట్ల విద్యుదావేశాన్ని రాగి కడ్డీ ఆకర్షించి ఎర్త్ కనెక్షన్ ద్వారా భూమిలోకి పంపేస్తుంది.

ఇదీ కారణం..

క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడిన సమయంలో తీవ్రమైన గాలులు, ఉరుములు, మెరుపులు వస్తుంటాయి. పిడుగు పడిన ప్రాంతంలో ఏడెనా బుగ్గి కావాల్సిందే. కొన్ని లక్షల ఓల్టుల విద్యుత్తు తరంగాలు మేఘాల నుంచి భూమిలోకి ప్రవహిస్తాయి. నీటి ఆవిరితో ఉన్న మేఘాలు ఒక్కదానికొకటి తాకడం వల్ల విద్యుత్తు పుడుతుంది. ఈవిద్యుత్తే పిడుగుల రూపంలో భూమిపై పడి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి.

కేయూ ఉప కులపతి ఎవరో?

● రేపు సెర్చ్ కమిటీ సమావేశం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిని నిర్ణయించడం కోసం ఈ నెల 4న సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. 14వ ఉప కులపతిగా బాధ్యతలు నిర్వహించిన సామాజికశాస్త్రం విశ్రాంత ఆచార్యులు తాటికొండ రమేష్ పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగిసింది. ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను ఇన్‌ఛార్జి ఉప కులపతిగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు ఉప కులపతుల నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. కొత్తవారిని నియమించడం కోసం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కేయూ వీసీ నియామకం కోసం జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆకుల వేణుగోపాల్ రెడ్డి (నామిని), జమ్ము విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామిని), రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామిని)తో సెర్చ్ కమిటీని నియమించారు.

158 మంది పోటీ..: విశ్వవిద్యాలయ ఉప కులపతి పదవిని దక్కించుకోవడం కోసం రాష్ట్రంలోని పలు వర్సిటీలు, విద్యా పరిశోధన సంస్థల నుంచి పలువురు పోటీపడుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా తీవ్రమైన పోటీ నెలకొంది. 158 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో కేయూ ఆచార్యులు నలుగురు బరిలో ఉన్నారు. ప్రస్తుత రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి (గణిత విభాగం), దూర విద్య కేంద్రం సంచాలకులు వి. రామచంద్రం (రాజనీతిశాస్త్రం), టి.యాదగిరిరావు (ప్రభుత్వ పాలనా శాస్త్రం), టి.శ్రీనివాస్ (సామాజికశాస్త్రం)లు పదవిని ఆశిస్తున్నారు.

8 మంది విశ్రాంత ఆచార్యులు..: కేయూలో 30 ఏళ్లపాటు బోధన, పరిశోధన, పరిపాలన సేవలను అందించిన ఆరుగురు విశ్రాంత ఆచార్యులు కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. వీరిలో జి.దయాకర్, వి.రవీందర్ (రసాయనశాస్త్రం), కె.పురుషోత్తం (ఆంగ్లం), ఎం.ఆశోక్‌కుమార్, వెంకటనారాయణ (అర్థశాస్త్రం), బి.ఐలయ్య (తెలుగు), టి.శ్రీనివాసరావు (వాణిజ్యశాస్త్రం), సీహెచ్ దినేష్‌కుమార్ (రాజనీతిశాస్త్రం)లు దరఖాస్తు చేసుకున్నారు.

14న దరఖాస్తుల పరిశీలన..: ఈ నెల 4న రాష్ట్ర సచివాలయంలో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. దరఖాస్తు చేసుకున్న ఆచార్యుల, విద్యావేత్తల బయోడేటాలను పరిశీలిస్తారు. బోధన, పరిశోధన, పాలన అనుభవాలను పరిగణలోకి తీసుకుంటుంది. అత్యంత ప్రతిభ కలిగిన ముగ్గురి పేర్లతో జాబితాను గవర్నర్‌కు అందజేస్తారు. వీరిలో నుంచి ఒకరిని కేయూ ఉప కులపతిగా నియమిస్తారు. ప్రక్రియ సజావుగా సాగితే 15 రోజుల్లో కేయూకు కొత్త వీసీ రానున్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి



కల్యాణి (పాత చిత్రం)

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం దేవేందర్, రమ దంపతుల కుమార్తె కల్యాణి(22) హైదరాబాద్ అమీర్‌పేటలో ఉంటూ ఓ కోచింగ్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటోంది. ఆమెకు కొన్ని రోజుల క్రితం జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చింది. హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా డెంగీ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య

● ఏకలవ్య ఆశ్రమ పాఠశాల భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని



జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో రూ. 40కోట్లతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల(ఈఎంఆర్ఎస్) నూతన భవనాన్ని బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఝార్ఖండ్‌లోని హజరిబాగ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వెనుకబడిన గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు నెలకొల్పిన వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభ శిలాఫలకాన్ని పీవో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో రూ.40కోట్ల వ్యయంతో ఈ ఆశ్రమ పాఠశాలను నిర్మించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ గురుకులంలో 500 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి అత్యుత్తమైన బోధన అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో అలివేలు, జడ్పీ సీఈవో నర్మద, ఆర్ఎస్‌వో హాసింగ్, మండల ప్రత్యేకాధికారి సురేష్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, గురుకుల ప్రిన్సిపల్ అజయ్‌సింగ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన పూల సంబరం


హనుమకొండలోని నక్షత్ర అవెన్యులో...


హనుమాన్‌నగర్‌లో..


దాసాంజనేయస్వామి ఆలయ ఆవరణలో..


హనుమకొండలో..


ప్రశాంత్‌నగర్‌లోని డాక్టర్స్ కాలనీ పార్కులో..



జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను కనులపండువగా నిర్వహించారు. మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. ఆలయాలు, మైదానాల్లో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ ఆడిపాడారు.

– న్యూస్‌టుడే బృందం


ఎల్కతుర్తిలో..


ధర్మసాగర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో..


మాణిక్యాపూర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద..


హనుమాన్‌నగర్ దాసాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే నాయిని దంపతులు


పరకాల పశువుల సంత ఆవరణలో..




క్యాంపు కార్యాలయంలో బతుకమ్మను పేరుస్తున్న ఎమ్మెల్యే సతీమణి నీలిమరెడ్డి


డీజిల్‌కాలనీలో..


ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో..


ప్రశాంత్‌నగర్‌లో..


టీచర్స్ కాలనీలో..


ధర్మసాగర్‌లో..


బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో..

జాతిపితకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, సంఘాల ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

– న్యూస్‌టుడే బృందం


కలెక్టరేట్‌లో చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అధికారులు


శాయంపేటలో తహసీల్దార్ కార్యాలయంలో...


ఒంటిమామిడిపల్లిలో..


భారాస పార్టీ కార్యాలయంలో..


ఆరెపల్లిలో...


నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో..


పరకాలలో..


దామెరలో...


మడికొండ బురుజు వద్ద..


కాజీపేటలో..


కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిషోర్ ఝా నివాళి..


కమలాపూర్‌లో..

భారాస నేతల మాటలు విడ్డూరం

నయీంనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొండ సురేఖపై సామాజిక మాధ్యమాల్లో భారాస నేతల వైఖరిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సురేఖకు స్థానిక ఎంపీ స్వాగతం పలకడంలో తప్పేముందని ప్రశ్నించారు. భారాస పదేళ్ల పాలనలో మహిళలను గౌరవించని వారు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ స్థాయిని మరచి వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మంత్రి కొండ సురేఖకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏఆర్ అశోక్‌బాబు సస్పెన్షన్

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం భూ ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.అశోక్‌బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనతో పాటు విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు నిబంధనలు ఉల్లంఘించారంటూ సెప్టెంబర్ 28న ఫిర్యాదులు అందాయి. వారు భూమి కబ్జా చేసినట్లు సమాచారం రావడంతో, సంబంధిత పత్రాలు పరిశీలించిన అనంతరం పాలక మండలి సభ్యుల ఆమోదంతో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు ఎస్టేట్ కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన డ్రైవర్‌గా పని చేస్తున్న ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏఆర్‌గా పని చేస్తున్న అశోక్‌బాబు కేయూ భూములకు సంబంధించిన 229 సర్వే నంబర్‌లో సెప్టెంబర్ 10న వివిధ విభాగాల అధికారులు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తున్న క్రమంలో వారిపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసి, వర్సిటీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించారని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

రిజిస్ట్రార్‌తో వాగ్వాదం..

విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో గాంధీ జయంతి నిర్వహిస్తుండగా రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డితో సస్పెన్షన్‌కు గురైన ఏఆర్ అశోక్‌బాబు వాగ్వాదానికి దిగారు. ఇది విశ్వవిద్యాలయ ఉద్యోగుల ప్రవర్తన నియమావళికి విరుద్ధమంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మడికొండ, న్యూస్‌టుడే: అపరిచితులతో చాటింగ్ చేయకుండా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ అన్నారు. మడికొండలోని లోటస్ వేవ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో ఐటీ ఉద్యోగులకు సైబర్ జాగ్రత్త దివస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సైబర్ నేరాలకు గురైతే ఉమ్మడి పక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జె.రాజబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

మడికొండ, న్యూస్‌టుడే: మాదిగలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తక్షణమే రాజీనామా చేయాలని భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మడికొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణను నిలువరించే ప్రయత్నం ఎవరు చేసినా మాదిగ జాతి తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు బండారు సురేందర్, ఎస్సీమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బరిగల బాబు, నాయకులు రేణుకుంట్ల మహేశ్, ధనుంజయ్, వస్కుల భాస్కర్, మౌళి, మల్లేశ్, కిరణ్, సారంగపాణి, రాజేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ స్వచ్ఛంద సంస్థ అవార్డు

ముచ్చర్ల (హసన్‌పర్తి), న్యూస్‌టుడే: హనుమకొండ మండలం పలివేల్పులకు చెందిన లార్డు స్వచ్ఛంద సంస్థకు రాష్ట్ర ఉత్తమ సంస్థ అవార్డు లభించిందని సంస్థ నిర్వాహకుడు ఎన్.నరేశ్ బుధవారం తెలిపారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌ని రవీంద్రభారతిలో ఈ నెల 1న నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

గర్భిణికి పురుడు పోసిన 108 సిబ్బంది

ఐనవోలు, న్యూస్‌టుడే: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది ఇంట్లోనే పురుడు పోశారు. కక్కిరాలపల్లికి చెందిన భార్గవికి బుధవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. ఆమె భర్త రాజు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. మండలంలో అందుబాటులో లేకపోవడంతో హనుమకొండ ఐఆర్‌సీఎస్ 108 అంబులెన్స్ వచ్చింది. నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ చైతన్య ఇంట్లోనే ప్రసవం చేశారు. అనంతరం శిశువును, బాలింతను సీకేఎం ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని పైలెట్ వెంకటేశ్ తెలిపారు.

నయీంనగర్ వంతెనకు 50 శాతం కేంద్రం నిధులే

సుబేదారి, న్యూస్‌టుడే: వరంగల్ స్మార్ట్‌సిటీలో భాగంగా నయీంనగర్ వంతెన కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తేనే నిర్మాణం జరిగిందని భాజపా జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, కార్పొరేటర్ చాడ స్వాతి అన్నారు. బుధవారం పార్టీ నాయకులు నయీంనగర్ వంతెనను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీలో భాగంగా కేంద్రం 50 శాతం నిధులు ఇస్తే, రాష్ట్రం 30, నగరపాలక సంస్థ 20 శాతం చొప్పున నిధులు ఇచ్చాయన్నారు. కాంగ్రెస్, భారాస నాయకులు మేమంటే మేం నిర్మించామని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుజ్జుల వసంత, నాయకులు వాసుదేవరెడ్డి, విజయ్, శ్రీకాంత్, రఘుపతి, జితేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

భారాసపై ఎమ్మెల్యే నాగరాజు, రాఘవరెడ్డి ఫిర్యాదు

మడికొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై భారాస సోషల్ మీడియా చేసిన అనుచిత ట్రోల్స్‌పై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆయిల్‌ఫెడ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి బుధవారం మడికొండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటమిని తట్టుకోలేక ప్రజల్లో కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణ చూసి భారాస నేతలు మతి భ్రమించి ట్రోల్స్ చేస్తున్నారని విమర్శించారు. దీనికి ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు బాధ్యత వహించి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో సీతక్కపై కూడా చాలా రకాల ట్రోల్స్ చేశారని ఆరోపించారు. భారాస నేతలపై ఐటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట ఛైర్మన్ రఘుచందర్, మాజీ ఛైర్మన్ కుర్ల మోహన్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, దువ్వ శ్రీకాంత్, పల్లపు అర్జున్, వస్కుల శ్రీను, గణేష్‌యాదవ్, నీలం రజనీ, జ్యోతి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజు మద్యం, మాంసం విక్రయాలు

కమలాపూర్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలు నిషేధం. కానీ కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. కొందరు అడ్డదారుల్లో మాంసం విక్రయాలు చేపట్టారు. గొలుసు దుకాణాల్లో అధిక ధరలకు మద్యం విక్రయించారు.

హౌజ్ ఆఫ్ జాయ్‌లో పండ్ల పంపిణీ

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని కాజీపేట హౌజ్ ఆఫ్ జాయ్‌లోని మానసిక వికలాంగులకు బుధవారం రాత్రి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దంపతులు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. మానసిక వికలాంగుల పట్ల జాలితో కాకుండా ప్రేమతో చూడాలని అప్పుడే వారిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని సీపీ తెలిపారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్, లవన్ కుమార్, శివకృష్ణ పాల్గొన్నారు.

బతుకమ్మలతో రహదారిపై నిరసన

బాలసముద్రం, న్యూస్‌టుడే : కేఎల్ఎన్ రెడ్డి కాలనీకి చెందిన కమ్యూనిటి హాల్ భూమిలో ఆధ్యాత్మిక కేంద్రం నిర్మించారని, తమకు బతుకమ్మ ఆడేందుకు ఇబ్బందిగా ఉందంటూ స్థానిక మహిళలు ప్రధాన రహదారిపై బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కాలనీ వాసుల అవసరాల కోసం కేటాయించిన 9గుంటల భూమిలో రామకృష్ణ ధ్యానమందిరం నిర్మించారని కేఎల్ఎన్ రెడ్డి కాలనీ డెవలప్‌మెంట్ సేవా సొసైటీ అధ్యక్షుడు కె.వీరారెడ్డి ఆరోపించారు.

పరకాల నియోజకవర్గం

కాంగ్రెస్ కార్యకర్తల గొడవ

పరకాల, న్యూస్‌టుడే: పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. ఇటీవల పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కొలువుదీరిన సందర్భంగా పట్టణంలో చాలా చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలపై పాత నాయకులతో పాటు ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చిన వారి చిత్రాలను కూడా ముద్రించారు. బుధవారం కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సదర్భంగా ఫ్లెక్సీల్లో చిత్రాలపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తల మధ్య గొడవకు దారి తీసింది. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

దామెర, న్యూస్‌టుడే: తమ భూమిని కొందరు ఆక్రమించి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని దామెర మండలం ముస్త్యాలపల్లికి చెందిన చిలువేరు భిక్షపతికి విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబరు 255/1 లో తనకు 2 గుంటల భూమి ఉండగా ఓ మహిళ కబ్జా చేసిందని ఆరోపించారు. అధికారులు దీనిపై విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

దామెర, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దామెర, ల్యాదళ్ల గ్రామాల్లో బుధవారం ఉపాధిహామీ పనులపై నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీవో శారద, ఈసీ రాజేష్, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, కార్యదర్శులు పాల్గొన్నారు.

కారోబార్లకు పదోన్నతులు అవసరం

దామెర, న్యూస్‌టుడే: జీవో నెంబర్ 60 ప్రకారం పంచాయతీల్లో పనిచేసే కారోబార్లకు వేతనాలు చెల్లించాలని కారోబార్ల సంఘం జిల్లా నాయకుడు సురేష్ కోరారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కారోబార్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి కల్పించాలన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట, న్యూస్‌టుడే: నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆయన బుధవారం శాయంపేటలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దసరాకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. శాయంపేటలో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో ఫణిచంద్ర, నాయకులు సంపత్‌రావు, దూదిపాల బుచ్చిరెడ్డి, మారపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

సుబేదారి, న్యూస్‌టుడే: సుబేదారి ఠాణా పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి కథనం మేరకు.. హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేట సమీపంలో సుబేదారి పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో స్పోర్ట్స్‌కాలనీకి చెందిన రాపోలు సాయికుమార్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కన్పించాడు. పోలీసులు తనిఖీ చేయగా వాహనంలో 230 గ్రాముల ఎండు గంజాయి లభించింది. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టామని పోలీసులు తెలిపారు. సాయికుమార్ డిగ్రీ చదవుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గొలుసు దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం నగరంలో మద్యం దుకాణాలను బంద్ చేశారు. దీంతో నగరంలో పలు గొలుసు దుకాణాలు తెరిచి అందులో మద్యం విక్రయిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు.. కేయూ ఠాణా పరిధిలోని నిరూప్‌నగర్‌లోని కిరాణం దుకాణంలో ఎ.రమాదేవి మద్యం అమ్ముతుండగా పట్టుకున్నారు. రూ.54,460 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొమటిపల్లి, నిరూప్‌నగర్ తండాలోని బి.ఐలు ఇంట్లో రూ.50,590 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిల్స్‌కాలనీ ఠాణా పరిధి శాకరాశికుంటలో లలిత, ఎండీ సలీం నివాసంలో తనిఖీలు చేయగా రూ. 38,220 మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు విచారణ కోసం కేయూసీ, మిల్స్‌కాలనీ ఠాణాలో అప్పగించామని తెలిపారు.

మద్యం పట్టివేత

ఐనవోలు, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా మద్యం విక్రయాలు చేస్తున్న గొలుసు దుకాణాలపై పోలీసులు బుధవారం దాడులు చేశారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వనమాలకనపర్తిలో రెండు గొలుసు దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారని పోలీసులు గుర్తించారు. రూ.18 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని, నారాయణ రాజేశ్‌కుమార్, కారింగుల కృష్ణవేణిలపై కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో నిందితులు?

మట్వాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో జరిగిన యువతిపై సామూహిక అత్యాచారం ఘటనలో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బాధిత యువతి పోలీసులకు తెలిపిన వివరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు పరారీలో ఉన్న మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఘటనపై లాడ్జి నిర్వాహకులను పోలీసులు తీవ్రంగా మందలించారు. పూర్తిస్థాయి వివరాలు తీసుకోకుండా గది ఇవ్వడంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేల్చారు. యువకుల అరెస్టుకు సంబంధించి గురువారం పోలీసులు విలేకరుల సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఈ విషయంపై ఇంతేజార్‌గంజ్ పోలీసులను వివరణ కోరగా.. స్పందించలేదు.

కాంగ్రెస్ నాయకుడికి అంగరక్షకుల తొలగింపు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుడు, మంత్రి కొండా దంపతుల ప్రధాన అనుచరుడు, మాజీ రౌడీషీటర్ నవీన్‌రాజ్‌కు అంగరక్షకులను తొలగించారు. ఇటీవల వరంగల్ పోలీసు డివిజన్‌లో నవీన్‌రాజ్ వ్యవహారం వివాదాస్పంగా మారింది. దీంతో ఆయనకున్న అంగరక్షకులు ఉంచాలా.. వద్దా? అనే అంశాలపై విచారణ జరిపిన పోలీసులు అవసరం లేదని నిర్ధారించుకున్న తర్వాత తొలగించారు. బుధవారం ఆ అంగరక్షకులు పోలీసు కమిషనరేట్ ఏఆర్ విభాగంలో రిపోర్టు చేశారు. ప్రస్తుతం వరంగల్ తూర్పులో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

ఉత్సాహంగా చదరంగం పోటీలు


విజేతలతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ తుషార ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెస్(అండర్-15 విభాగం) పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు పద్మజ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 102 మంది బాలబాలికలు హాజరయ్యారని పోటీల నిర్వాహక కార్యదర్శి కన్నా తెలిపారు. ఆర్బిటర్స్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ.. ముగ్గురి అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీష్

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఆటో కోసం రాత్రి సమయంలో రోడ్డుపై వేచి ఉన్న వ్యక్తిపై దాడి చేసి, అతడి వద్ద డబ్బులు దోచుకున్న ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం హనుమకొండ ఠాణాలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సెప్టెంబర్ 30న దేవన్నపేటకు చెందిన వ్యక్తి రాత్రి గ్రామానికి వెళ్లేందుకు గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆటో కోసం వేచి చూస్తున్నాడు. ఆ సమయంలో హనుమకొండ లష్కర్ సింగారం ప్రాంతానికి చెందిన జన్ను రాజ్‌కుమార్, వరంగల్ పోచమ్మమైదానానికి చెందిన కట్కూరి యాకూబ్, కట్కూరి రేణుక కలిసి ఒంటరిగా ఉన్న వ్యక్తిపై వెనుకనుంచి దాడి చేసి, ఆటోలో ఎక్కించుకొని పోచమ్మకుంట శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లారు. కొట్టి, అతని వద్ద ఉన్న రూ.10 వేల నగదు దోచుకున్నారు. మరో రూ.వెయ్యి గూగుల్ పే చేయించుకొని, అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బుధవారం హనుమకొండ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కన్పించిన నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకొన్నారు. వారి నుంచి రూ.900 నగదు, చరవాణి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఎస్సై సతీష్, హెడ్‌కానిస్టేబుల్ రావూఫ్, కానిస్టేబుల్ గౌస్ పాషాలను ఏసీపీ అభినందించారు.